


నాగురించి నేను. ప్రేరణ
పుట్టిందీ, పెరిగిందీ, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో.
చదువు వెలగ బెట్టింది కాకినాడ, హైదరాబాదులలో.
మంచి పుస్తకాలు చదవడం, స్నేహితులతో కాలక్షేపం చేయడం ఇష్టం!..ముద్దుముద్దుగా ఉండే పసివాళ్ళతో ఆడ్డం మరీ ఇష్టం!
ఉద్యోగం — ఐ.డి.పి.ఎల్‌లో చీఫ్ స్టోర్ కీపర్.

ఇక 'సంతాప సభ' గురించి....
అకస్మాత్తుగా వైల్డ్ ఫైర్ మాదిరి విజృంభించే మతకల్లోలావల్ల జరిగే హాని ఊహించడానికే భయంగా ఉంటుంది. మహానగరంలో ఒక గంటచాలు—ఆ మహమ్మారి వేల ప్రాణాలతో చెలగాటాలాడడానికి! ఈ అలజడులు జరుగుతోన్నప్పుడల్లా నాకెందుకో ముందు స్కూలు పిల్లల మీదకు పోతాయి—నా ఆలోచనలు. వాళ్లు ఏవిధంగా ఇంటికివస్తారు?
అసలు వస్తారా? రాకపోతే, వాళ్లు రాని క్షణాలు ఎలా మన ప్రాణాలు తోడతాయి?? జీవితం అంటే చదువూ ఆటలుగా ఊహించుకునే వాళ్ళ మెదళ్లమీద ఈ దారుణకృత్యాలు ఎటువంటి గుర్తులు వేస్తాయో. వద్దు...
ఏనేరం చేయని వాళ్లు వీటికి బలికావడం జాతి దురదృష్టం...
రేపటి విద్యార్థుల్ని, రేపటిపౌరుల్ని ఈవిధంగా
తర్ఫీదు ఇస్తే, ఈవిధంగా మలుచుకుంటే బావుంటుందేమో...ఆ ఊహే ఈకథగా మారింది...

— శ్రీసుభా



# సంతాప సభ

## శ్రీసుభా

మా హెడ్ మాస్టారు రమణయ్యగారు నన్ను రమ్మని కబురు చేశారు. నేను వెళ్లేసరికి ఆయన కాగితాల మధ్య తలమునకలవుతూ కన్పించారు.

"నమస్తే" అన్నాను.

ఆయన కూర్చోమంటూ కుర్చీ చూపించి, ఆపైన ఎదురుగావున్న కేలండర్ చూసి "ఇరవై రోజులేవుంది" అనుకుని నావైపు చూసి "ఏం చేద్దామంటావ్.." అన్నారు.

నాకు అర్థమయ్యింది. రమణయ్యాగారి
ఉద్దేశం...ఆయన కళ్ళు కేలండర్‌లో ఏ తేదీని చూశాయో అదీ అర్థమయ్యింది.

"ఏముంది సార్...మామూలుగా ఫ్లాగ్ ఆయిస్టింగ్...ఆపైన స్వీట్స్...ఆ తరువాత ఉత్తమ విద్యార్థులకు బహుమతి ప్రదానం. మధ్య
లో కాకపోతే ఆఖర్లో 'మనలో జాతీయ భావం ఇసుకలోపడ్డ ఉదకమై ఏవిధంగా హరించుకపోతోందో, అదే నిత్యమైతే, అదే సత్యమైతే మనకు మిగిలేది ఏమీ ఉండదని మేధావులు కనీసం ఈ ఒక్క విషయంలోనైనా అద్వైతాన్ని దూరంగానెట్టి ఆలోచించాలనీ' విన్నపం చేయా
లి...ముగింపు జనగణమన....."

"నువ్వో విషయం మర్చిపోయావ్... అది క్షమించరాని నేరం సుమా..."

నేను ఏమిటన్నట్లు చూశాను...

జ్యోతిష్కులు గతంచెప్పి ఉబ్బేస్తే—నాయకులు భావిని అరచేతిలో స్వర్గంచేసి మాబెడతారు...మనం ఏం చేయాలో అర్థమవుతోందా..."

"మీ నోటవింటేనే బావుంటుంది సార్. శంఖంలో
పోసిన తీర్థం అంటే..."


Ramanov

"దేశీయభావం మనసావాచా పాటించేవాళ్ళు వృద్ధులై, తాము చెప్పింది యువత పట్టించుకోదనే నిరాశతో శరుగులై ఇళ్ళల్లో మగ్గుతున్నారు. మధ్య వయస్కులు— కలుషిత వాతావరణంలోపడి దారితప్పి బతికేస్తున్నారు. ఇక యువతరం అంటావా ఈత నేర్వకుండా నీటిని దూకి అపర అభిమన్యులు...వీళ్ల గురించి కళ్ళు వత్తుకున్నా, పెదవులు విరిచినా ఫలితంశూన్యం...చూడు— ముక్కుపచ్చలారని పసివాళ్ళు మన చుట్టూతా మన స్కూళ్లో వందలమీద ఉన్నారు..వాళ్ళల్లోంచి పదిమందిని ఎన్నుకోవడం నీలాంటి వాడికి పెద్ద పనికాదు. ముక్కు పచ్చలారని పసివాళ్ళచేత ఓ చక్కని నాటిక ప్రదర్శింప జేయడం అదీ నీకో లెఖలోది కాదు. మన సీతారామయ్య సహాయం తీసుకో...అతను రచయిత కాబట్టి నీకు సహాయపడతాడు. ఈ కాలానికీ పరిస్థితులకూ అద్దంపట్టే సమస్యని ఎన్నుకోండి....ఏమంటావ్..."

రమణయ్యగారి ఆవేశం, ఆదర్శం నాకు తెలియనివి కావు...ఆ పైన సచ్ఛీలత పట్ల ఆయనకున్న నమ్మకం, ఆ సచ్ఛీలతకు నీరుపోసి, మడికట్టి పెంచి పెద్దచేసి, దాని సత్ఫలితాలు అందరికీ అందుబాటులోకి రావాలని కాంక్షించే ఆయన తపనా నాకు తెలియనిదికాదు..

"సరేసార్...నా శాయశక్తులా కృషి చేస్తాను...పిల్లలచేత పెద్దపెద్ద నటులు ముక్కుమీద వేలేసుకునేటట్టు నటింప జేయలేనుగానీ భుజాలు తడుముకునేటట్టు చేయగల్నని ఎందుకో కించిత్ నమ్మకం.

*

మా స్కూలు తెలుగు మీడియం స్కూలు కాబట్టి తెలుగు విద్యార్థులు చాలామంది ముందుకు వచ్చారు. నాకు కావల్సింది నలుగురు కుర్రవాళ్ళు. మిగిలిన వాళ్ళని నిస్పృహ పర్చడం ఇష్టంలేక సీతారామయ్యకు అప్పగించాను. సీతారామయ్య వాళ్ళకు ఏకపాత్రాభినయం, పాటలు, పద్యాలు, మిమిక్రీ ఇత్యాది రంగాల్లో తర్ఫీదు ఇవ్వడం మొదలు పెట్టాడు.

నాకు, విద్యార్థులచేత పాతబడిన నాటిక ప్రదర్శింప జేయడం ఎందుకో అంతగా నచ్చక సీతారామయ్య కొత్తగా వ్రాసిన 'దేవుడి మతం' అనే నాటికను ఎన్నుకున్నా...వేషాలు వేసే విద్యార్థులకు ముందుగా నాటిక చదివి విన్పించి వాళ్ళ ఉత్సాహాన్ని పసిగట్టడం జరిగింది. అయితే ఓ కొత్తపేచీని నేను ఎదుర్కోవల్సి వచ్చింది. మా 'దేవుడి మతం'లో పాత్రలన్నీ వివిధ మతాలకు చెందిన దేవుళ్ళు...లేకపోతే ప్రవర్తలనీనూ...ఒక్కొక్క సందర్భంలో మాచిన్న దేవుళ్ళు క్షుణ్ణంగా, స్పష్టంగా, వాళ్ళ మతం గురించి, బోధలగురించీ వివరించవల్సి ఉంది...పాత్రధారుల్లో వివిధ మతాలకు చెందిన విద్యార్థుల్ని ఆయాపాత్రలకు ఎన్నికచేయడం పెద్ద కష్టమైన పనేమీకాదు...విద్యార్థులు కూడా అందుకే ఓటు వేశారు. కానీ సీతారామయ్య రచయితగా చిన్న అభ్యంతరం లేవదీశాడు.

"మనం అనుకోకుండానే మనకు వివిధ వర్గాలకు చెందిన కుర్రకారు దొరికారు కదా...అందుకని వాళ్ళకిచ్చే పాత్రల్లో వైవిధ్యం చూపిద్దాం. తద్వారా కుర్రవాళ్ళ మెదడులో కాస్త విజ్ఞానంతోపాటు వెలుగుని కూడా నింపిన వాళ్లమవుతాం..." అంటూ.

"అదిసరే...మనది సెక్యులర్ స్టేటే కాదనను. కానీ వీళ్ళచేత వాచాదోషాలూ అచ్యుతప్పులూ పడకుండా చూడ్డంలో నాకష్టం ఎంతటిదో నీకేం అర్థంకాదు. పైగా ఆగస్ట్ పదిహేను చూస్తే అప్పుడే సింగారించుకుని ఊరి మొగదాకా వచ్చేసింది" ఎటూతెగక అన్నాను.

"నేను సహాయం చేస్తాను".

"సహాయం చేస్తావ్‌గానీ నటించలేవుకదా. మీ రచయితలతో ఇదే చిక్కు...కాగితం మీద ఊహించిందంతా రంగస్థలం మీద బాహాటంగా కన్పించాలనుకుంటారు..."

ఇంతలో రమణయ్యగారు అటుగా వెడుతూ మా గదిలోకివచ్చి, ఆ పైన నాదీ, సీతారామయ్యదీ వాదన విన్నారు. ముందుగా తన సహజమైన చిన్ననవ్వు నవ్వి,

"దర్శకుడికీ, రచయితకీ మధ్య నాలాంటివాడు రాకూడదు. ఈ పరిస్థితిలో నన్ను ఆర్గనైజర్‌గా ఊహించకండి...మన తెలుగు నాటక రంగంలో చాలా అవకతవకలకు కారకులు ఈ ఆర్గనైజర్సే! వాళ్ళు నటులకన్నా, దర్శకులకన్నా ఎదిగిపోవడంతోనే మన నాటకరంగం దిగజారడం మొదలయ్యింది. అది మీకూ తెలుసు అంటూ బయటకు వెళ్ళారు...నేనూ, సీతారామయ్యా మొహామొహాలు చూసుకున్నాం. నవ్వుకున్నాం.....

** ** **

మాకు కావల్సింది నలుగురు విద్యార్థులు..మేం ఏరుకున్నది కూడా నాలుగు మతాలకు చెందిన నలుగురు కుర్రవాళ్ళని...ఈ కుర్రకారులు తెలుగులో దిట్టలే కాకుండా మాతృభాష మీద చిన్న చూపులేని వాళ్ళు. అలాంటి దిట్టలకు వాళ్ళకు అసలే పరిచయం లేని మరో మతం తాలూకు దేవుడు, లేకపోతే దేవదూత. అదీకాకపోతే మతపెద్దలాంటి వేషాలు ఇవ్వడం జరిగింది.



## అతి చిన్న సైకిల్

బ్రిటిష్ అబ్బాయి నీల్ హాకిన్స్ వయసు 8 సంవత్సరాలు. అంత చిన్న వయస్సులో బజార్లో దొరికే విడిభాగాలు కొనుక్కొని ఓ బుల్లి సైకిల్ తయారుచేసి దానిమీద రోజూ స్కూలుకు పోని గాడు 'హాకిన్స్'! ఈ పనిచేసినందుకు గాను అతని పేరు 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోకి ఎక్కింది.

—హర్షవర్ధన్

మొదట్లో మాకు కాస్త ఇబ్బందే అయ్యింది. రాఘవ నమాజ్ చదవడం, అజ్‌మత్ శ్రీ కృష్ణుడై భగవద్గీత బోధించడం, డేవిడ్ జత్తేదార్‌గామారి, జప్‌దీసాహెబ్, రెహరాస్ సాహెబ్, కీర్తన్ సోహిలా ఇత్యాది ప్రార్థనలు చేస్తూ గురునానక్ సూక్తులు వినిపించడం; బలవంత్ సింగ్ థామస్‌గామారి ఇంగ్లీషులో క్రైస్తు గురించీ, బైబిల్ గురించి, చర్చి గురించీ చర్చించడం, వాళ్ళని తర్ఫీదు చెయ్యడానికి కాస్తంత ఇబ్బందే అన్పించింది.

వాళ్ళకిచ్చిన పోర్షన్స్ తీసుకుంటూ అజ్‌మత్, రాఘవ అడగనే అడిగారు.

"మాచేత మా మతానికి దగ్గరగావుండే పాత్రలు వేయించరాదా మాస్టారూ" అని. డేవిడ్, బలవంత్ సింగ్ కూడా నసుగుతూ కొంచెంలో కొంచెం పై అభిప్రాయాన్నే వ్యక్తంచేశారు.

"మీకు ఇబ్బందిగావుంటే చెప్పండి..కానీ వేరే కారణాలు ఉన్నాయా...."

"అదికాదు సార్"

"మీ ఇళ్ళల్లో వాళ్ళు ఒప్పుకోవడంలేదా! కోప్పడ్డారా..."

వాళ్ళు మాట్లాడలేదు.

నేను వాళ్ళకు శాయశక్తులా నచ్చచెప్పాను...మనకు మరో మతం గురించి తెలిసే అవకాశం వచ్చినప్పుడు పోగొట్టుకోకూడదన్నాను. మన మతం గురించి మాత్రమే తెలియడం మానవత అవదనీ, మనిషి అన్నిదిక్కులవైపు చూస్తోన్నట్టే మనిషి దృక్పథంకూడా విస్తరించాలని హెచ్చరించాను.

సీతారామయ్య అందుకున్నాడు.

"మీరు ఈ నాటికలో వేసే వేషాలు మీకు ఉత్సాహాన్నే కాదు ఉత్తేజాన్ని కూడా ఇస్తాయి. నీ గురించి కాదు, ఎదటివాడి గురించి ఆలోచించాలనే ఆలోచన మనిషికి పుట్టాలంటే మనిషి నాలుగు చెరగులా విశాలంగా ఎదగాలి. 'నా మతం నా అభిమాన మతం—మరో మతం అప్రస్తుతం...అనడం చాలాతప్పు. మీరీనాళ, ఈ పాత్రలు ధరించి రేపు పెరిగి పెద్దవాళ్ళయి, ఈ దేశం మంచి మత సౌహార్ద్యాన్ని ఊరిపొలిమేరల వరకూ తోలుకువెళ్ళి సరికిపోగులు పెట్టేయ్యాలని కాదు!! మనం బతుకుతూ నలుగురూ బతికే అవకాశం ఎలా ఇవ్వాలో, ఎందుకు ఇవ్వాలో తెలుసుకుంటారని. సరేనా...మంచిగా పోర్షన్ చదువుకురండి..."

"సరేసార్"

వాళ్ళు రకరకాల డ్రెస్సులు వేసుకుని, మొహానికి రంగులు పూసుకుని రంగస్థలంమీద నటకిశోరాలై, నటశేఖరులై నటిస్తోన్నట్టు ఊహించకుండా ఉండలేక పోతున్నాను...'నాటకమేనియా' నా మెదడులో అప్పుడే స్థిరపడి రంగంసిద్ధం చేసుకుంటోందని నాకు అర్థమయ్యింది. నా వెర్రికి నవ్వొచ్చింది".

నీ మతంకన్నా నామతం గొప్పదీ అనడానికి వేలకు

నేను దృష్టాంతాలు చూపించవచ్చు, ఎవరైనా సరే!!!కానీ నీమతం ఇందుమూలంగా నామతం కన్నా తక్కువది అని చెప్పడానికి మనిషికి గానీ, దేవుడికి గానీ ప్రవక్తకి గానీ, మతాచార్యులకు గానీ కష్టమైన పనే...ఇలా ప్రయత్నించిన మూలంగానూ, మత మౌఢ్యంతో ప్రవర్తించిన
మూలంగానూ గతంలోనూ, ప్రస్తుతం కూడా మతాల మధ్య ఘర్షణలూ, మతం పాటించే వారి మధ్య దారుణమైన కొట్లాటలూ, హత్యలూ మారణకాండా జరుగుతున్నాయని నా అభిప్రాయం...మా నాటిక వస్తువుకూడా అదే అయ్యింది!!

** ** **

రిహార్సెల్స్ జరుగుతున్నాయి...నాటికకు మూడు రోజుల వ్యవధి మాత్రంవుంది. ఆరోజు స్కూలు నుంచి మామూలుగా ఇంటికి వెళ్ళి గంటలోపున రిహార్సెల్స్‌కు రావల్సిన అజ్‌మత్ ఆలీ డేవిడ్ రాలేదు... వచ్చిన రాఘవ బలవంత్ సింగ్ చేసేదేమీ లేక మేగ్‌జైన్స్ చూస్తూ కూర్చున్నారు. ఏడుగంటల ప్రాంతంలో అజ్‌మత్ డేవిడ్ వచ్చారు..వచ్చినవాళ్ళు అలవాటుగా ఆలస్యంగా వచ్చినందుకు క్షమాపణలు అడగకుండా "మీతో మాట్లాడాలి సార్" అంటూ నాముందు గొణకడం మొదలుపెట్టారు...

"ఏమిటి" అన్నాను.

"మా ఫాదర్ చాలా కోపంగావున్నాడు సార్... నాటకం వేయొద్దంటున్నాడు..."

"ఏం జరిగింది?"

"ఇలానేను భగవద్గీత శ్లోకాలు చదవడం, అదీ నాటకం గురించి అయినా తప్పట. అల్లా క్షమించడుట..'వేరే మనిషిని వాళ్ళు చూసుకుంటారు ఇల్లు కదలద్దన్నాడు.."

నేను ఆశ్చర్యపోయాను...డేవిడ్ తన ఇంట్లో వాళ్ళ అభిప్రాయం చెప్పాడు. అది అజ్‌మత్ ఆలీ చెప్పిన దానికి విరుద్ధంగా లేదు...

"మరెలా చెప్పండి...మిమ్మల్ని నమ్మికదా ఈ ప్రయత్నం చేసింది...ఇలా మధ్యస్తంగా మానేస్తే స్కూలు పరువేంగాను..."

"మాకయితేఅయిష్టంలేదు సార్...కానీ..." డేవిడ్ ఆగి అన్నాడు..."పోనీ గొడవెందుకు సార్, మా మతాలకు సరిపడ్డ వేషాలు మాకివ్వండి. ఇంట్లో వాళ్ళూ ఏమీ అనరు..."

నేను ఆలోచించాను..కానీ అలా జరగడానికి వీల్లేదు..ఇప్పుడు వాళ్ళ పాత్రలు మారిస్తే పోర్షన్స్ మారతాయి...నాటికకు గడువు తక్కువ కాబట్టి రసాభాస కావచ్చు కూడా...పైగా ఈ పద్ధతి చాలా బావుంటుందని ఆలోచించి చేసింది...అర్థంలేని అభిప్రాయాలకు విలువ ఇవ్వడం అంటె దురభిప్రాయానికి పెద్ద పీట వేయడమే...బాగా ఆలోచించి అన్నాను..." మీ వాళ్ళతో నేవెళ్ళి మాట్లాడతాను. వాళ్ళని ఒప్పిస్తానుసరేనా" అని....

అజ్‌మత్, డేవిడ్ నేను అలా అనేసరికి కాస్త ధైర్యం తెచ్చుకున్నారు. రిహార్సెల్స్ మామూలుగా జరిగాయి..

తొమ్మిది గంటలకు ఆ పనిపూర్తిచేసుకుని నేను స్కూటర్ ఎక్కబోతూంటే రఘుపతి వచ్చాడు. రఘుపతి నా క్లాస్‌మేట్..పైగా రాఘవకు పినతండ్రి అవుతాడు. పలకరింపులు అయిన తర్వాత

"ఇలా పనుండి వచ్చాను..ఎలానూ కలిశాం...అది. సరేగానీ మా రాఘవచేత నాటకం వేయిస్తున్నావుట" అంటూ మొదలుపెట్టాడు.

"అవును..." అన్నాను.

"వాడంతా చెప్పాడు...వాడి పాత్రకూడా చూశాను అదేకాదు; వాడిదగ్గర మిగతా నాటికంతా చదివాను".

"బావుందా..."

"నా మొహంలా ఉంది..."

"అంటే బావుందన్నమాట...మంచి అలంకారం వాడావులే..." అన్నాను.

"చాల్లే ఊరుకో...ఆ నాటకం ఏమిటి? మనవాళ్ళని వెదగొట్టడానికి కాకపోతే ఆ రాతలేమిటి? హిందూ మతం ఔన్నత్యం గురించి మీకు తెలుసా! ఆ మతం ముందు ఈ మతాలన్నీ అసలు నిలబడగలవా? అన్ని మతాలూ ఒకటెలా అవుతాయి...ఎంత బొంకినా పిల్ల కాలవ గోదావరి అవుతుందా!వింధ్యపర్వతాలు హిమగిరులవుతాయా అవతలి మతం వాళ్ళు డబ్బుతో కాకపోతే మనలో మన విభేదాల్ని పెంచే దారుణాలు చేస్తూంటే సెక్యులర్ బైనాక్యులర్స్ పెట్టుకుని మీరంతా చెడింది కాకుండా..."

"చూడు రఘుపతీ...నువ్వు మాట్లాడిందాంట్లో నిజం ఎంతో అబద్ధం ఎంతో బేరీజువేసే శక్తి నాదగ్గర లేదు. మనకిష్టంవున్నా లేకపోయినా, పరాయి మతాలు మన దేశంలో వేళ్ళు తన్నడమే కాదు, మహావృక్షాలై ఎదిగివున్నాయి. ఈ దేశంలో ఒకేమతం— అదీ ఏ మతమైనా సరే తనే ఉండాలనీ బతికి బట్టకట్టాలనీ ప్రయత్నం చేస్తే దాని ఉనికికి అదే నాశనం కోరుతున్నట్టు మనం అనుకోవచ్చు...ఈ దేశంలో "ఇది అసాధ్యమైనని" అని దేన్నయితే మేధావులు నిర్ధారిస్తారో ఆపని జర




గాలనుకోవడం; జరిపితీరతాం అని ప్రతిజ్ఞలు పలకడం, జరిగితే బావుండునని కలలు కనడం; తెలివిహీనులు మాత్రమే చేస్తారు..." రఘుపతి క్రోధంతో నావైపు చూశాడు.....

"మీరందరూ ఉష్ణపక్షులు. మీలాంటి వాళ్ళను మార్చడం అసంభవం అది నాకూ తెలుసు...కానీ చరిత్ర పునరావృతం అవుతుంది...జాతి..."

"అదిగో రఘుపతీ...అది చలివేంద్రం...అదిగో చూడు అది హోటల్...దూరంగా ఉందిచూడు అది బార్...అన్నిటిలోకీ జనం వెడతారు. కాలమాన పరిస్థితులబట్టీ, మన యోచనబట్టీ, మన అంచనాని బట్టీ ఎందులోకి వెళ్ళాలో నిర్ణయించుకోవల్సింది మనమే... ఏదైనా అంతే....

"మీరంతా వెన్నెముకలేని మనుషులు. మీ చేతుల్లో విద్యార్థుల్ని అలానే తయారు చేస్తున్నారు...."

"నేను నవ్వేశాను..." వెన్నెముక కన్నా ముఖ్యం, హృదయం...అదివుండేలా చేస్తున్నాం మేం? తప్పు అవగలవా?"

రఘుపతి కొరకొరా చూశాడు—నావైపు.

** ** **

నాటిక ప్రదర్శనకు ఇక రెండు రోజులే గడువు ఉంది. స్కూలు ప్రాంగణందాకా స్వతంత్ర్యపు పూడా విడి వచ్చేసింది. హెడ్ మాస్టార్ రమణయ్యగారు ఆగస్టు పదిహేనున జరగవల్సిన ఇతరకార్యక్రమాల గురించి తలమునకలవుతున్నారు. తరగతుల వారీగా విద్యార్థుల్ని రకరకాల ఆటలు, బేండ్‌మార్చ్‌లకు తర్ఫీదులు ఇస్తున్నారు. మా నాటికలో పాత్రధారులకు కూడా సగం సంతోషంగానూ, మరోసగం ఆందోళనగానూ ఉంది. ప్రదర్శన రోజు దగ్గర పడుతూంటే పాత్రధారులకు కలిగే తాత్కాలిక భయం, అది!! టైము తక్కువవున్న మూలంగా రిహార్సెల్స్ పగలే కాకుండా రాత్రికూడాఅదీ పొద్దుపోయేవరకూ చేయించసాగాం. మరో రోజు గడిచింది. అంటే తెల్లవారితే శుభదినం. మా విద్యార్థులెవరూస్కూలునించి ఇంటికి పోలేదు. వాళ్ళకు కాఫీ ఫలహారాలు తెప్పించాం. సీతారామయ్య సలహా మేరకు డ్రెస్ రిహార్సెల్స్ మొదలు పెట్టాం. డ్రిల్ మాస్టారు రోజ్‌పీర్ మేకప్‌చేయడంలో దిట్ట..." చూడముచ్చటగా ఉంటుంది. మేకప్ కూడా చేద్దాం. రేపటి ప్రదర్శనకు ఇది డ్రెస్ రిహార్సల్స్‌గా" అన్నాడు. ఏడుగంటలయ్యింది...

నాటిక రసపట్టులో నడుస్తోంది. మతాల మధ్య అతి సాధారణంగా జరిగే చర్చ ఆగి పెద్దలు వాగ్వివాదంలో పడతారు. ఆ తరువాత అభిప్రాయ భేదాలు వస్తాయి... క్లయిమాక్సులో....

ఇంతలో వీధిలో అరుపులూ కేకలూ వినిపించాయి. వాటిని మేం అంతగా పట్టించుకోలేదు. మరో పావు గంటలో మరోసారి కేకలు, దూరంగా హాహాకారాలు... నగరంలో అల్లర్లులేక రాజకీయ నాయకులఆర్భాటాలూ అయ్యుంటాయి అనుకున్నాం. ఐదు నిముషాలు గడిచాయి. మా స్కూలు గేటుకు కట్టిన జాతీయ పతాకాల నమూనాలు, స్కూలు బిల్డింగ్ నుంచి క్రింది—

వరకూ వ్రేళ్లాడే తోరణాలు రెపరెపలాడ్డం మాని కుప్పకూలాయి. మనుషుల చేతుల్లోంచివిసరబడ్డ రాళ్ళు తలుపుల్నీ, గోడల్నీ ఉన్మాదంగా ఢీకొంటున్నాయి.

ఏం జరుగుతోందో, ఎందుకు జరుగుతుందో తెలుసుకుందామని నేనూ సీతారామయ్యా గదిలోంచి బయటకు వచ్చాం...మాకెదురుగా పదిమంది మనుషులు...వాళ్ళు మనుషుల్లా కాకుండా మతి తప్పిన తీవ్రవాదుల్లా రెండు మూడు భాషల్లో అశ్లీలంగా మాట్లాడుతూ, మాకు ఏవిధమైన అవకాశానికీ అవగాహనకీ చోటివ్వకుండా మీద పడ్డారు. అది స్కూలనీ, అక్కడ జరిగేది విద్యాసముపార్జన మాత్రమేననీ దయుంచి బయటకు వెళ్ళమనీ నచ్చజెప్పబోయాం. ఇంతలో మరో పదిమంది బయట నుంచి వచ్చారు. లోపల ఏమీ తెలియని విద్యార్థులు ఉన్నారు. వాళ్ళకు ఏమీ జరగకూడదు. ఏ పరిస్థితిలోనూ పసివాళ్ళు మితిమీరిన అహంకారుల చేతుల్లో, మతోన్మాదుల మూఢత్వానికి బలికాకూడదు. నేను సీతారామయ్యా మరి కొంచెం బెట్టు చేసివాళ్ళని ఆపు చేయాలని చూశాం...అంతే...ఏదో జరిగింది. ఒపదునైన ఆయుధం నడుంమీద, జబ్బలమీద విద్యుత్ వేగంతో శరీరం లోపలికివెళ్ళి, సజావుగా సరియైన మార్గాన వెడుతూన్న రక్తాన్ని బహిర్గతం చేస్తూ, తద్వారా విపరీతమైన బాధని మిగిల్చింది. చుట్టూ మనుషులు రూపాలు చెడి కనబడడం, కళ్ళు బైర్లుకమ్మడం, బలంతగ్గి నిస్సత్తువ కమ్ముతున్నా, ఎదురు దాడి చేయాలనే బలహీనమయిన

కోర్కె...చేతకానితనం ముందు తలవంచుతున్నా మనే ఉక్రోషం...నాకు రాఘవ, అజ్‌మత్ ఆలీ, డేవిడ్ సింగ్ గుర్తువచ్చారు. వాళ్ళకేమీకాకూడదు.ఏ..మీ..కా.

** ** **

నాకు మెలుకువ వచ్చింది. చుట్టూ చూశాను. అది మా ఇల్లుకాదు. స్కూలుకాదు. నాకు అర్థమవడం మొదలయ్యింది. నేను ఉన్నది ఉస్మానియా జనరల్ ఆస్పిటల్లో ఎమర్జెన్సీ వార్డులో. పడుకునే నా శరీరాన్ని చూసుకున్నాను. పొత్తికడుపు చుట్టూ, ఎడం భుజం మీద బేండేజ్ గుడ్డలు...చుట్టూ మంచాలవైపు చూశాను. నాలాగే చాలామంది కన్పించారు. నా ఆలోచన ముందుగా మా ముక్కుపచ్చలారని నటులమీదకూ, ఆ పైన సీతారామయ్యవైపు పోయింది. నాకేం జరిగిందో తెలుస్తూనేవుంది. నాకు జరిగినట్టు చాలామందికి జరిగేవుండాలి. నిజమే!! సీతారామయ్యకికూడా కత్తిపోట్లు తగిలేవుంటాయి. కానీ..మాకు జరిగినట్లు రాఘవకు, అజమత్ ఆలీకు, డేవిడ్‌కు, బలవంత్ సింగ్‌కూ జరగకూడదు. ఈ ఒక్క నష్టం జరగకపోతే— తమకే నష్టం జరగవల్సివున్నా భరించవచ్చు...లేక మొగ్గలు విచ్చుకోకుండా భూమిలో ధూళిలోపడి మరకలు ఆనవాలుగా మిగుల్చుకోకూడదు. అటుగా నర్స్ వచ్చింది.

"లేవండి" అని "లేవగలరా" అంటూ ఆప్యాయంగా పలకరించి చేతిసాయంతో మంచంమీద లేపి కూర్చోబెట్టి ఇన్‌జక్షన్ చేసింది.

"ఇప్పుడు సిటీలో ఎలావుంది?"

నర్స్ నామొహం వైపు చూసి "మంటలు చెలరేగుతునే ఉన్నాయి. హైదరాబాద్ నగరం సగంపైగా కర్ఫ్యూలో తన్నుకుంటోంది".

"అయితే ఆగస్ట్ పదిహేను..."

"ఈవేళ పదహారు..."

"నాకొంచెం సహాయం చేయాలి"

నర్స్‌నవ్వి "మీవాళ్ళు వచ్చి మిమ్మల్ని చూసి వెళ్లారు..మీకేం ప్రమాదంలేదు..."

"నాగురించి కాదు...మా స్కూలు" అంటూ అంతాచెప్పి, "ఆ వివరాలు నాకు కావాలి...ఆ పిల్లలు ఏమయ్యారో తెల్సుకోగలరా..." అంటూ గుర్తుతెచ్చుకుని ఒక్కొక్కడి ఎడ్రసూ చెప్పాను.

"ప్రయత్నిస్తానండీ"

"మనవార్డులో అయితే ఎవరైనా పదీపదిహేనేళ్ళ లోపు కుర్రాళ్ళు గాయాలతో జేరారా..."

"చాలామంది"

నాకు వణుకు పుట్టింది. ఏదో కీడు శంకిస్తోంది, మనసు....

"మీరు అనవసరంగా కంగారు పడకండి...వాళ్ళ పేర్లు యివ్వండి నేను వాకబు చేస్తాను..."

నేను పేర్లు ఇచ్చాను...గంట తర్వాత నర్స్‌వచ్చి ఆ


వెలువడినవి జనప్రియ పుస్తకమాల

మాజిక్
రు. 15:00
ఆంధ్రా మాండ్రేక్ "షాదో" తనదైన శైలిలో మాజిక్ ప్రియుల కోసం ప్రతి ట్రిక్‌ను సచిత్రంగా ప్రతివారు మాజిక్ నేర్చుకోవడానికి వీలుగా వన్నో ట్రిక్కులతో అతిసుందరంగా వెలువరించిన మాజిక్ బుక్.

స్వప్న సందేశం
రు. 20.00
మీ కలలకు భాష్యం చెప్పే ప్రప్రథమ శాస్త్రీయ గ్రంథం. మిమ్మల్ని గురించి మీరేమనుకొంటున్నారు. ఇతరులను గురించి మీరేమనుకొంటున్నారు. మీ కలలద్వారా మీ సమస్యలకు పరిష్కారమెలా? ఫ్రాయిడ్ యాడ్లర్ యూంగ్‌ల సిద్ధాంతాలు ఒరవడిలో వెలువడిన పుస్తకం. రచన: ఎ. వెంకటేశ్వరశాస్త్రి

మాతాశిశు సంరక్షణ
రు: 18:00
స్త్రీ పురుష జననేంద్రియ నిర్మాణం, గర్భము దాల్చుట, శిశువు పెరుగుదల, గర్భిణీస్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, గర్భిణీస్త్రీలలో వచ్చు వ్యాధులు, నివారణోపాయాలు, బిడ్డల సంరక్షణ, ఆహారపు విలువలు చర్చించిన పుస్తకం. రచన: డా॥ లక్ష్మీనరసమ్మ, ఎం.బి.బి.ఎస్.,

ఆయుర్వేద చికిత్స రు. 18/-
భారతీయ వైద్య శాస్త్రంపై ప్రాథమిక అవగాహనను కల్పించేటి పుస్తకంలో సాధారణ దీర్ఘవ్యాధులకు ఆయుర్వేదం ద్వారా నివారణోపాయాలను సూచించిన రచన
రచయిత
డా॥ చిన్మయ

హోమియో చికిత్స రు. 10.00
హోమియో చికిత్సను గురించి ప్రాథమిక పరిచయం
రచయిత: డా॥ నియాజ్

హిప్నాటిజం రు. 15:00
శాస్త్రీయ దృక్పథంతో వెలువడిన రచన
టి. యస్. రావ్.

యోగాసనములు రు. 12:00
(సచిత్రంగా)
కె. రాజశేఖర్

సర్జన్ సలహాలు రు. 15:00
సాధారణ, అసాధారణ వ్యాధులగురించి సలహాలు.
డా॥ కె. రవీంద్రబాబు

పల్లవి పబ్లికేషన్స్

పేరుగల వాళ్ళు ఎవరూలేరని చెప్పింది. దాంతో నా భయం రెట్టింపు అయ్యింది.

** ** **

నేను వీలైనంత త్వరగా హాస్పిటల్ నుంచి డిస్చార్జి అవాలని చూశాను. నా భార్య అరుణతో ఆ విషయమే చెప్పాను—ఆ రాత్రి.

"నేను కనుక్కుని వచ్చేదాన్నే...కానీ ఆ ప్రాంతం అంతా కర్ఫ్యూలో వుందండి. ఎలా మరి"

"స్కూలుకు ఫోన్ చేశావా"

ఎవరూ ఎత్తలేదు.

ఆ మధ్యాహ్నం అనుకుంటాను. నాపక్క బెడ్‌మీద నాలాగే కత్తిపోట్లు తిన్న వ్యక్తి తాలూకు ఆడవాళ్ళు హాస్పిటల్‌కు భోజనం తెచ్చారు. ఆవిడకు నలభై ఏళ్ళు పైనవుంటాయి. భర్త పక్కన కూర్చుని మాట్లాడుతూనే కళ్ళనీళ్ళు పెట్టుకుంటోంది. భర్త ఓదారుస్తున్నాడు. ఆమాటలు నా చెవిని పడుతున్నాయి.

"అజ్‌మత్ ఆలీ ఎలావున్నాడు"

"బాగానే ఉన్నాడు...."

"లేదు, నువ్వు అబద్ధం చెబుతున్నావ్! వాడికేదో జరిగింది. నా దగ్గర దాస్తున్నావ్. ఆ పాడు నాటకం, ముందునుంచీ వద్దంటున్నా వినకుండా పోయాడు".

"వాడికేం కాలేదు. నమ్ము..."

"అయితే వాడ్నెందుకు తీసుకురాలేదు..."

"రేపు తీసుకువస్తా..."

నాకు ఆతృతాగిందికాదు.మధ్యలోకలుగజేసుకున్నాను. ఆదంపతులకు నన్నునేనుపరిచయంచేసుకున్నాను

"మీరేనా పంతులిని..."అజ్‌మత్ తండ్రిమొహం పక్కకి తిప్పుకున్నాడు. అతని భార్యకు నమస్కారం చెప్పి మరోసారి అడిగాను. అజ్‌మత్ ఆలీ గురించీ తక్కిన విద్యార్థుల గురించీ...

"పిల్లగాడికేం కాలే...సబ్..."

"రేపోసారి హాస్పిటల్‌కు తీసుకువస్తారా. నాకోసం"

ఆమె సరేనంది.

రేపు వెంటనే, నిముషాలమీద, క్షణాల మీద, నా ముందు వాలితే ఎంతబావుండును! ఇరవైనాల్గుగంటలు ఈ ఆతృతతో ఎలా వెళ్ళదీయాలి...తప్పదు...

** ** **

"నమస్తే మాస్టారూ..."

అజ్‌మత్ ఆలీని చూస్తే నాకు ఉద్వేగం ఆగింది కాదు. కళ్ళు చెమర్చాయి. పసివాడి ముందు కన్నీళ్ళు తిప్పుకోవడం తప్పని తెలుసు. కానీ తప్పలేదు.

'ఎలావున్నారుమనవాళ్ళంతామీకేంజరగలేదుకదా'.

అజ్‌మత్ ఆలీ మంచం మీదకి కాళ్ళెత్తి కూర్చుని జరిగిందంతా చెప్పాడు. ఆ చిన్నవాడి కళ్ళల్లో రెండు రోజులనాటి బీభత్సం, హింసాకాండ, అరాచకత్వం తాలూకు ఛాయలు కన్పిస్తూనే ఉన్నాయి. మాట్లాడుతూ, మధ్యలో ఆనాటి అనుభవం గుర్తొచ్చి తట్టుకోలేక బావురుమనేశాడు. వెంటనే నా ప్రమేయం లేకుండా చొక్కాతోనే కళ్ళు వత్తుకున్నాడు. ఎక్కిళ్ళు ఆపుకుని.

"బతికిపోయాం మాస్టారు..ఆ గూండాలు నమ్మల్ని చంపేసే వారే కానీ మా అవతారాలు చూశారు...తెగప్రశ్నలు వేశారు...కొందరు మీలో హిందువులెవరని నిలదీశారు. నలుగురం వేదాలూ భగవద్గీతా వల్లించాం. వదిలేశారు. తరువాత వచ్చిన వాళ్ళు 'ముస్లింలూ మీరంతా అంటూ పరీక్ష పెడితే అందులోనూ నెగ్గాం...నిజం మాస్టారు మాప్రాణాలు దక్కింది మీ వల్లనే..." అంటూ జరిగిందంతా చెప్పాడు..."

"అది సరే సీతారామయ్య మాస్టారూ..."

అజ్‌మత్ ఆలీ మాట్లాడలేదు...

నువ్వు ఆయన్ని చూడలేదు.

"మాస్టారు మాగదిలోకి వచ్చార్ సార్. ఇంతలో జనం వచ్చారు. మా వేషాలు పీకేశారు...తన్నారు... మాస్టారు అడ్డుకుంటే ఆయన్ని లాక్కుపోయారు. మమ్మల్ని లైబ్రరీ రూమ్‌లోకి తోసేసి తలుపులు బిగించారు..." అంతకు మించి అజ్‌మత్ ఆలీ చెప్పలేక పోయాడు.

** ** **

వారం అయ్యింది. నేను హాస్పిటల్ నుంచి డిస్చార్జి అయ్యాను. ఈ లోపున సీతారామయ్య గురించి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. రాఘవ డేవిడ్ బలవంత్ సింగ్‌లు కూడా ఏమీ చెప్పలేక పోయారు. స్కూలు తెరిచారు. మరోవారంచూశాం. సీతారామయ్యరాలేదు. ఆ సాయంకాలం రమణయ్యగారు నాకు కబురుచేసి, కూర్చోబెట్టి నెమ్మదిగా అన్నారు. "సీతారామయ్య అకాల మరణంపట్ల సంతాపసభ ఏర్పాటు చేద్దాం... ఏమంటావ్" అని. నాకు నోరు పెగల్లేదు. బాధతన్నుకు వస్తోంది "లేదు. అతను పోలేదు. పోయుండడు.. పోకూడదు కూడా..." అన్నాను.

రమణయ్యగారు భయంకరమైన వాస్తవాన్నివేదాంతపరంగా మార్చి పసిపిల్లవాడికి అర్థమయ్యేటంత తేలికైన భాషతో మాటమాటకీ నేర్చి చెబుతూ నన్ను ఊరడించారు. మనసుకు సర్దిచెప్పుకోవడం ఎలాగో, మనసుకు ఊరట కల్గించుకోవడం ఎలాగోవివరించారు.

"సరే మీ ఇష్టం..."

"సరేకాదు...అతను వ్రాసిన ఆ నాటికని, మీరు మధ్యస్థంగా వదిలేసిన ఆ కార్యక్రమాన్ని సంతాప సభకు జతచేయాలి..."

"వద్దుసార్....ఆ నాటికని, ఆ జ్ఞాపకాల్ని అంతటితో వదిలేద్దాం. నేను భరించలేను. నలుగురి పసివాళ్ళని రక్షించగల్గిన సీతారామయ్య అమృతవాక్కులు అతన్ని కాపాడలేకపోయాయి...సారీ..."

"అలా అనొద్దు...ఒక ఆదర్శం కోసం ఒక మనిషి చేసిన ప్రయత్నం ఆ మనిషి లేనంత మాత్రాన ఆగిపోకూడదు. సీతారామయ్య ఖాళీచేసిన చోటులో వందల వేల సీతారామయ్యలు పుట్టుకురావాలంటే ఇలాంటి ప్రయత్నాలు ఆగకూడదు. విస్మృహ సిరికితనానికి చిహ్నం. నామాట విను. సీతారామయ్యకు అనామకుడూ, అనాథ అనే బిరుదు రావడం అన్యాయం కదూ"

నేను రమణయ్యగారి వైపు చూస్తూనేవున్నాను. నాకు సీతారామయ్య కన్పించాడు ఆయనలో! "సీతారామయ్య చావలేదు...నేను చావనివ్వను ఏ పరిస్థితిలోనూ" అని అనుకున్న తర్వాత నాలో దుఃఖం మాయమైంది.

శ్రీసుభా, సి– 116,
ఐ.డి.పి.ఎల్.కాలనీ,
బాలానగర్ టౌన్‌షిప్, (పి.ఒ)
హైదరాబాద్– 500 037

ప్రేమ విజయాలు

## ప్రేమించి పెళ్ళి చేసుకున్న వారికి శుభవార్త!

ప్రియమైన పాఠకులారా!

మీలోఎందరో పెద్దల్ని సంఘంలోని కట్టుబాట్లను కులమతాలని అడ్డుగోడలను అధిగమించి ప్రేమించి పెళ్ళిచేసుకున్న వాళ్ళుంటారు. ప్రేమ అనేది సృష్టిలోనే గొప్పవరం. ప్రేమించినవారిని ధైర్యంగా స్వంతం చేసుకోడం సాహసవంతమైన అదృష్టం. అందుకే ఉదయంవీక్లీ ప్రేమించి పెళ్ళి చేసుకున్న వారిని గురించి క్లుప్తంగా ఫోటోలతోసహ ప్రచురించాలని నిర్ణయించుకుంది. పెళ్ళిగా మారిన మీ ప్రేమకథను రెండు అరఠావులకు మించకుండా మీ ఫోటో, వీలున్నంత వరకు పెళ్ళిఫోటో జతచేసి 'ప్రేమ విజయాలు'శీర్షికకు' అని కవరుమీద రాసి మాకు పంపండి. మీ కథ నేటి యువతరానికి స్ఫూర్తినిస్తుంది. కులమత వర్గ రహిత సమసమాజ స్థాపనలో యువతరాన్ని ముందుకు నడుపుతుంది. మరింకెందుకు ఆలస్యం. మీ ప్రేమ కథ వెంటనే మాకు రాయండి

ఎడిటర్